సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 8 । ఆగస్టు । 2024



స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 2.52 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.3 /23.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రత్యేక షెడ్యూల్‌లో ఐకేపీ ఉద్యోగుల బదిలీలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామీణాభివృద్ధి శాఖలోని ఐకేపీ ఉద్యోగుల బదిలీలు ప్రత్యేక షెడ్యూల్‌లో జరుగుతాయని డీఆర్‌డీఓ నర్సింములు తెలిపారు. ఐకేపీలో బదిలీలు లేనట్లేనా.. అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వీరి బదిలీల కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని, జీఓ 11 ప్రకారం 2023లో సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానం పేస్కేల్ అమలు అవుతుందని, బదిలీల కోసం ప్రభుత్వం కమిటీ నియమించిందన్నారు. కమిటీ నివేదిక ప్రకారం త్వరలో బదిలీలు జరుగుతాయన్నారు.

అనన్యరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కు చెందిన సివిల్స్ ర్యాంకర్ దోనూరు అనన్యరెడ్డిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో చదవాలని డీఈఓ రవీందర్ సూచించారు. పొన్నకల్ పాఠశాలలో బుధవారం అనన్యరెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డి స్ఫూర్తితో జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సమాజంలో బాధ్యతతో వ్యవహరించేలా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు బాలుయాదవ్, దుంకుడు శ్రీనివాస్, రామలింగం, వెంకటేష్, రవినాయక్, గ్రామస్తులు లింగారెడ్డి, కొండా జగదీశ్వర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రెడ్ రన్ మారథాన్



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక స్టేడియంలో యూత్‌ఫెస్ట్ రెడ్‌రన్ మారథాన్ నిర్వహించారు. రన్‌లో వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. రన్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారిని అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.పద్మ, ఇన్‌చార్జి అడిషనల్ డీఎంహెచ్ఓ డా. భాస్కర్ నాయక్, డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్, డీపీఎంఓ శ్రీనివాసులు, ఎస్ఏసీఎస్ కోఆర్డినేటర్ డా.ప్రవీణ, డా.సుభాషిణి, డా. స్వరూప, ఎం.శ్రీనివాసులు, అథ్లెటిక్స్ కోచ్ సునీల్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు పీఆర్సీ ఆప్షన్ ఇవ్వండి



స్టేషన్ మహబూబ్‌నగర్: 2017 ఏప్రిల్ తర్వాత రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు అప్పటి నుంచే పీఆర్సీ ఆప్షన్ ఇవ్వాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు యాజమాన్యం అనేక బకాయిలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉండగా.. 2017 సంవత్సరానికి సంబంధించిన ఒక పీఆర్సీని అమలుచేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో భగవంతు, నారాయణ, నాగాంజనేయులు, ఆర్.నారాయణ, కొండయ్య, టీసీఎస్ రెడ్డి, భాస్కర్, బుచ్చన్న, లలితమ్మ, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలుషితంతో కలకలం

గురుకులాలు, కేజీబీవీల్లో కలవరపెడుతున్న ఫుడ్ పాయిజన్

■ ఈనెల 4వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న భోజనం వికటించి 25 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. మరుసటి రోజు కలెక్టర్ సంతోష్ పాఠశాలకు వెళ్లి అక్కడే భోజనం చేసి.. ఆహార తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించి వచ్చారు. తీరా రాత్రి భోజనం తర్వాత మరో 15 మంది విద్యార్థినులతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులు సైతం అస్వస్థతకు గురయ్యారు.



అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళ్తున్న అస్వస్థతకు గురైన విద్యార్థులు

■ ఈనెల ఒకటో తేదీన లింగాలలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత అల్పాహారం తిన్న 20 మంది విద్యార్థినులు వాంతులు చేసుకొని ఆస్పత్రి పాలయ్యారు.

■ 3వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో ప్రభుత్వ మోడ్రన్ స్కూల్‌లో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

■ 3న నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్ మండలం చిన్నపొర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పురుగులు పట్టిన బియ్యంతో భోజనం తయారు చేయడం కలకలం రేపింది.

■ తాజాగా జడ్చర్ల మైనార్టీ గురుకులంలో 48 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 9 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో జడ్చర్ల ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు.

.....ఇలా ఉమ్మడి పాలమూరు జిల్లాలో వారం రోజుల్లోనే వరుసగా కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థకు గురికావడంతో పాటు ఆస్పత్రుల పాలవుతున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో వరుస ఘటనలతో బెంబేలు
- పెంట్లవెల్లి కేజీబీవీలో వరుసగా రెండు రోజుల పాటు విద్యార్థినులకు అస్వస్థత
- తాజాగా జడ్చర్ల మైనార్టీ గురుకులంలో 48 మందికి..
- ఆహారం తయారీపై కొరవడిన పర్యవేక్షణ



జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ముగ్గురు విద్యార్థులకు చికిత్స

జడ్చర్ల: విద్యార్థులకు విందు భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ లక్ష్యం క్షేత్ర స్థాయిలో బుట్టదాఖలు అవుతోంది. ఓవైపు అధికారుల పర్యవేక్షణ లోపం.. మరోవైపు ఇష్టారీతిగా ఆహారం తయారీతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో చోట కలుషిత ఆహారం బారినపడి విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నారు. నాసిరకం ఆహార పదార్థాలతో భోజనం తయారీకి తోడు గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో శుభ్రత లోపిస్తోంది. కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై అనారోగ్యం బారిన పడుతున్నారు.

పర్యవేక్షణ లోపం..

విద్యార్థులకు నాణ్యత గల ఆహారం అందించేందుకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చిస్తోంది. కేటగిరీ వారీగా పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తోంది. నిబంధనల మేరకు నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో గురుకులాలు, కేజీబీవీలు, పాఠశాలల్లో నాసిరకం ఆహార పదార్థాలను వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కుళ్లిన కురగాయలు, నాసిరకం ఆహార పదార్థాలతో తయారుచేసిన భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు ఆయా పాఠశాలలకు వెళ్లి తనిఖీ చేసి, సిబ్బందికి గట్టిగా హెచ్చరికలు జారీ చేసినా..మార్పు రావడం లేదు.



మైనార్టీ గురుకులంలో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

ఫుడ్ పాయిజన్‌పై కలెక్టర్ ఆరా

- జడ్చర్ల మైనార్టీ గురుకులం సందర్శన.. తయారు చేసిన వంటకాల పరిశీలన
- విద్యార్థులకు శుభ్రతతో ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశం

జడ్చర్ల: మున్సిపాలిటీలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 48 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మొత్తం 380 మంది విద్యార్థులకు బుధవారం ఉదయం కిచిడి, చింతపండు చారుతో కూడిన అల్పాహారం వడ్డించారు. తిన్న వెంటనే విద్యార్థులు ఒకరి తర్వాత మరొకరు వాంతులు చేసుకుంటూ, కడుపునొప్పితో బాధపడ్డారు. మొత్తం 48 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా.. 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో గురుకులంలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి, మిగతా విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనీష్, అబ్దుల్ రషీద్, సోఫియా, మాసూంబాబా, చరణ్, ఆయాన్, అయ్యూబ్, అబ్దుల్, యోగేష్, సమీర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

■ మైనార్టీ బాలుర గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయేందిర బోయి హుటాహుటిన పాఠశాలకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనంతో పాటు మజ్జిగ, గుడ్లు తదితర కూరగాయల నాణ్యతను పరిశీలించారు. బుధవారం మెనూ ప్రకారం భోజనం ఎందుకు తయారు చేయలేదని వంట సిబ్బందిని ప్రశ్నించారు. శుభ్రతతో విద్యార్థులకు ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆర్ఓ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న తాగునీటిని పరీక్షించి, నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురుకుల విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షించాలని వైద్యాధికారులకు సూచించారు. వంటగది, పాఠశాల ఆవరణలో కుక్కలు సంచరించకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఆర్ఎల్‌సీపై ఆగ్రహం..

మైనార్టీ గురుకుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో రీజినల్ సమన్వయకర్త ఖాజా బావుద్దీన్‌పై కలెక్టర్ విజయేందిర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల భవనానికి రంగులు వేయించి, శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన తర్వాత సమస్యలు చెప్పడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు.

■ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు ఇతర విద్యాలయాలపై పర్యవేక్షణ పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలస్థాయి అధికారులు నిత్యం హాస్టళ్లను సందర్శించి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ గురుకులంలో తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్ఓ పద్మ, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఆందోళనకు గురయ్యాను..



ఐదోతరగతి చదువుతున్న నా కుమారుడు అయాన్ టిఫిన్ చేసిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైనట్లు పాఠశాల సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాను. వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని దగ్గరుండి చూసుకున్నాను. ఇలా జరగడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం మా అబ్బాయి కోలుకున్నాడు.

– ఎండీ హుస్సేన్, విద్యార్థి తండ్రి, గౌరారం

ఎప్పుడు ఇలా జరగలేదు..



మా అబ్బాయి మైనార్టీ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గతంలో ఎప్పుడు ఇలా ఫుడ్ పాయిజన్ కాలేదు. ఈ రోజు మాత్రం ఫుడ్ ఫాయిజన్‌తో ఇబ్బంది పడ్డారు. భోజనం తయారీలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముున్ముందు ఇలా జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– సాబేర్, విద్యార్థి తండ్రి, నిమ్మబాయిగడ్డ

కడుపునొప్పిని తట్టుకోలేకపోయా..



రోజు మాదిరిగానే ఈ రోజు ఉదయం టిఫిన్ తిన్నాను. కిచిడి, కట్టా తిన్న కొద్దిసేపటికే కడుపులో నొప్పి రావడం మొదలైంది. తర్వాత కడుపులో వికారమై వాంతులు చేసుకున్నాను. ఇదివరకు ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇదే మొదటి సారి. ఏం జరిగిందో తెలియదు.

– అబ్దుల్ రషీద్, 10వ తరగతి

వాంతులు కావడంతో భయపడ్డా..



టిఫిన్ చేసిన కొద్ది సేపటికే అకస్మాత్తుగా వాంతులు అయ్యాయి. దీంతో ఒక్కసారిగా భయపడ్డా. నాతో పాటు మరికొందరు కడుపునొప్పితో బాధపడ్డారు. ఇంకొందరు వాంతులు చేసుకున్నారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాను. వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో ఆరోగ్యం కుదుట పడింది.

– అబ్దుల్ అబ్రార్, 10వ తరగతి

ఒక్కరోజు సమ్మెలోకి సఫాయివాలా

- 'స్వచ్ఛదనం – పచ్చదనం' వేళ నేడు విధుల బహిష్కరణ
- తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో స్వచ్ఛదనం– పచ్చదనం కొనసాగుతున్న వేళ గ్రామపంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు గురువారం ఒక్కరోజు సమ్మె చేపడుతున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. సమ్మెలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయాల వద్ద దీక్ష చేపట్టనున్నారు. ఫలితంగా స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలను వారు బహిష్కరించినట్లు అవుతుంది. కాగా, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే ఒక్కరోజు సమ్మెకు ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాలు దూరంగా ఉన్నాయి.

జిల్లాలో 1,577 మంది కార్మికులు..

జిల్లాలో 441 గ్రామపంచాయతీలు ఉండగా.. 1,577 మంది పారిశుద్ధ్య కార్మికులు (మల్టీపర్పస్) పనిచేస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో 10 నుంచి 12 మంది దాక ఉండగా.. చిన్న పంచాయతీల్లో నలుగురు నుంచి ఆరుగురు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ పరిధిలో వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పిలుస్తున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం, డ్రెయినేజీల నిర్వహణ, వనమహోత్సవం మొక్కల సంరక్షణ, పాఠశాలల శుభ్రత, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, విద్యుత్ దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో చెత్త సేకరణ కోసం సమకూర్చిన ట్రాక్టర్ల నిర్వహణకు ఇద్దరు చొప్పున వర్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కోలా జీతాలు..

ప్రస్తుతం చిన్న గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ. 8,500 వేతనం ఇస్తుండగా.. మేజర్ జీపీల్లో రూ. 19,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు.

డిమాండ్లు..

■ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు కార్మికులకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలి

■ ప్రమాద బీమా రూ. 10 లక్షలకు పెంచాలి.

■ విధుల్లో మృతిచెందిన కార్మికుల అంత్యక్రియలకు రూ. 30 వేలు చెల్లించాలి.

■ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి.

■ మున్సిపల్ ఉద్యోగుల మాదిరిగా జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి.

■ పంచాయతీ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలుపర్చాలి.

■ పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలి.

హామీని నెరవేర్చుకోవాలి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంచాయతీ కార్మికులకు రూ. 18 వేల కనీస వేతనం అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి. మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేదాక పోరాటం సాగిస్తాం.

– కురుమూర్తి, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

పారిశుద్ధ్యం లోపిస్తే సహించం: కలెక్టర్

రాజాపూర్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సహించమని కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. మండలంలోని తిర్మలాపూర్‌లో బుధవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందేలా సీసీరోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండటంతో పంచాయతీ కార్యదర్శి భరత్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను యజమానులే తొలగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వన మహోత్సవం లక్ష్యం మేరకు మొక్కలు నాటి పెంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ మశ్చందర్, ఎంపీఓ వెంకట్రాములు, ఏపీఓ భారతి ఉన్నారు.

మత్స్యబీజం.. ఆలస్యం!

రిజర్వాయర్లు, చెరువులు, కుంటలకు జలకళ

- చేప విత్తనాల కోసం మత్స్యకారుల ఎదురుచూపులు
- బకాయి బిల్లులు చెల్లించనందునే ఆసక్తి చూపని పంపిణీదారులు
- ఈ నెల 13 వరకు గడువు పొడిగింపు



ఆత్మకూర్ మండలం ఆరేపల్లిలో పంపిణీకి సిద్ధంగా ఉన్న చేప పిల్లలు

ఆత్మకూర్: ఉచిత చేప విత్తనాల పంపిణీ యధావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గతనెల ఆఖరున మత్స్యశాఖ అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. నేటికీ ఇంకా టెండర్లు ఖరారు చేయకపోవడంతో చేప విత్తనాల పంపిణీకి గ్రహణం పట్టినట్లయింది. గతేడాది కూడా ఇలాగే చిన్నపాటి కారణాలతో చేప పిల్లలను ఆలస్యంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదలడంతో వేసవి నాటికి ఆశించిన మేర పెరగకపోవడంతో లాభాలు రాలేదన్న వాదనలు మత్స్యకారులు వినిపించారు. ఈసారి మరో రకమైన సమస్యతో టెండర్ల ప్రక్రియ నేటికీ ఖరారు కాలేదు. గతేడాది చేప విత్తనాల సరఫరాకు సంబంధించిన బిల్లులు చాలా వరకు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మూకుమ్మడిగా టెండర్లు వేయకపోవడం, మరికొన్ని చోట్ల కేవలం ఒకే టెండర్ రావడంతో అధికారులు టెండర్ల ఖరారుకు గడువు పెంచుతున్నారు. రెండోసారి ఈ నెల 13 వరకు టెండర్ దాఖలుకు గడువు పొడిగించారు.

బకాయిలు చెల్లించకపోవడమే కారణమా?

గతంలో పంపిణీ చేసిన చేప పిల్లలకు సంబంధించి బిల్లులు చెల్లించని కారణంగా టెండర్లు దాఖలు చేసేందుకు తాము ముందుకురావడం లేదని ఇటీవల చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్లు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున తాము చేప పిల్లల ఉత్పత్తి వ్యాపారం కొనసాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

చేపల రకాలు తగ్గనున్నాయా?

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు గత ప్రభుత్వం కొన్నేళ్లుగా చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో ఏటా రకాలు తగ్గిపోవడం గమనార్హం. ఆయా జిల్లాల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా బొచ్చ, రోహు, మిడిగాల, బంగారుతీగలాంటి రకాలను పంపణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జిల్లాల వారీగా సొసైటీలు, చెరువులు..

జిల్లా	సొసైటీలు	చెరువులు, కుంటలు	పెంపకం లక్ష్యం (2024-25)
మహబూబ్‌నగర్	240	1,092	1.92 కోట్లు
నాగర్‌కర్నూల్	235	1,448	3.05 కోట్లు
వనపర్తి	142	1,059	2.50 కోట్లు
నారాయణపేట	147	650	1.81 కోట్లు
జోగుళాంబ గద్వాల	92	375	1.78 కోట్లు

మత్స్యకారులను ఆదుకోవాలి



చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రెండేళ్లుగా ఆశించిన మేర పెరగక ఆర్థికంగా నష్టపోతున్నాం. గతేడాది మా సొసైటీ తరుపున సుమారు రూ.60 లక్షలకుపైగా నష్టపోయాం. ఈ ఏడాదైనా త్వరగా పంపిణీ చేపట్టి ఆదుకోవాలి.

– నాగేష్, మత్స్యకారుడు, ఆత్మకూర్

అప్పుల్లో కొట్టుమిట్టాడుతున్నాం



గత ప్రభుత్వ ఆదేశాలతో మత్స్యశాఖ నిబంధనల మేరకు రూ.30 లక్షలు వడ్డీకి తెచ్చి చేపల పెంపకం చేపట్టా. టెండర్‌లో భాగంగా 40 లక్షల చేప పిల్లలను మత్స్యకారులకు అందించా. ఇందుకుగాను నాకు రూ.46 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఏడాది పూర్తయినా నేటికీ చేతికందకపోవడంతో వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నా.

– ఏటికాడి ఆనంద్, పంపిణీదారుడు, ఆరేపల్లి (వనపర్తి)

ఉన్నతాధికారులకు నివేదించాం



చేపపిల్లల పంపిణీదారులకు సంబంధించిన బిల్లు విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. ట్రెజరీ ద్వారా త్వరలోనే చెల్లింపులు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది కూడా లక్ష్యం మేర చేప పిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించాం. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 1,448 చెరువులు, కుంటల్లో 3.05 కోట్ల చేప పిల్లలను వదులుతాం.

– రహమాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

నేడు జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జానీపాషా బుధవారం ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఖాళీల భర్తీకి జాబ్ మేళా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలలోగా ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి చేరుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99485 68830, 91753 05435 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌కు గురై వివాహిత మృతి


భాగ్యమ్మ (ఫైల్)

తెలకపల్లి: విద్యుత్ షాక్‌కు గురై వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గౌరారం చెందిన భాగ్యమ్మ (51) మంగళవారం రాత్రి వాటర్ హీటర్ స్విచ్ తొలగించే క్రమంలో షాక్‌కు గురైనట్లు తెలిపారు. గమనించిన కూతురు నవ్యశ్రీ అరిచి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసే సరికి భాగ్యమ్మ చనిపోయిందని ఎస్‌ఐ తెలిపారు. భాగ్యమ్మ భర్త 20 ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఆమెకు కూతురు ఉంది. ఆమె సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

శాంతినగర్: బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన వడ్డేపల్లి మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొంకలకు చెందిన హరిజన రామకృష్ణ (35) వెంకట్రామనగర్ నుంచి బైక్‌పై మంగళవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. రాయచూర్ రోడ్డు వెంట వస్తుండగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి బైక్ రోడ్డు కిందికి దూసుకుపోయింది. కింద పడిపోయిన రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. ఉదయం జూలెకల్ శివారులో రామకృష్ణను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరు మృతి


కిరణ్‌నాయక్ (ఫైల్)

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ సమీపంలో బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావి చెట్టుబావి తండాకు చెందిన కిరణ్‌నాయక్ (25)తన బైక్‌పై పని నిమిత్తం కల్వకుర్తి వైపు వస్తుండగా ముందు మరో బైక్‌పై వెళ్తున్న కల్వకుర్తి పట్టణానికి చెందిన సయ్యద్‌పాషా ఢీకొట్టాడు. దీంతో కిరణ్‌నాయక్ బైక్‌పై నుంచి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన వారికి చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి..

కేటీదొడ్డి: ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింగనేడికి చెందిన ద్యావర నర్సింహులు (55) ద్విచక్ర వాహనం మీద సింగనేడి నుంచి కేటీదొడ్డి వైపు వస్తున్నాడు. ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్ కేజీవీల్స్ తగలడంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. ట్రాక్టర్, ఆర్టీసీ బస్సును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గద్వాల క్రైం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని మదనపల్లికి చెందిన తెలుగు రవి(38) ఈ నెల 5వ తేదీన పుటాన్‌పల్లి స్టేజీ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై అల్లుడు రామచంద్రుడు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మదనాపురం: మండలంలోని అజ్జకోలు శివారు రామన్‌పాడు కుడి కాల్వ వైపర్ల కొండన్న వ్యవసాయ పొలం వద్ద గుర్తుతెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామస్తులు గుర్తుతెలియని మృతదేహం ఉందని సమాచారం ఇవ్వడంతో అక్కడి వెళ్లి నీటిలో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి వారం రోజుల క్రితం నీటిలో పడి ప్రవాహానికి కొట్టుకొని వచ్చాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహంపై తెలుపురంగు బనియన్, బ్రౌన్ కలర్ ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని చెప్పారు. కార్యదర్శి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.




చేనేతలకు రాష్ట్ర పురస్కారాలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు చేనేత కార్మికులు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందుకున్నారు. చిన్న సీతారాములు (అమరచింత), గాజుల వెంకటేస్ (అమరచింత), పెరుమళ్ల సత్యన్న (తిపుడంపల్లి), బావండ్ల వెంకటేష్‌కు అవార్డుతో పాటు రూ.25 వేల నగదును అందజేశారు. గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డి గడిగే మునెప్ప అనారోగ్య కారణంగా అవార్డు అందుకోలేకపోయారు. - గద్వాల/అమరచింత

స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికల్లో సత్తా


మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్ ఎంపికల్లో పరుగెత్తుతున్న విద్యార్థులు (ఫైల్)

- ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది ఎంపిక
- రాష్ట్రంలోనే అత్యధికంగా నారాయణపేట నుంచి 14 మంది విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల్లో సత్తాచాటారు. ఈ ఏడాది స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు 29 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని హైదరాబాద్ హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్, కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఉమ్మడి జిల్లాకు చెందిన బాలబాలికలు 4వ తరగతిలో ప్రవేశాలు పొందారు. గురువారం నుంచి 10వ తేదీలోగా ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆయా స్పోర్ట్స్ స్కూళ్లలో రిపోర్టు చేయాలి. ఎంపికైన విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో మెరుగైన శిక్షణ అందజేస్తారు. మూడేళ్ల పాటు ఫెక్సిబిలిటీ కింద శిక్షణ అందజేసి, వారు ఎంచుకున్న క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇచ్చి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన వారే ఉండటం విశేషం.

జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు ఇలా..

- హైదరాబాద్ హకీంపేట స్కూల్‌కు నారాయణపేట జిల్లాకు చెందిన ఈ.యశ్వంత్‌గౌడ్, డి,అభినవ సాయి, ఎం.సాయి ప్రవళిక, ఎస్.సారిక, కె.భ్రమరాంబిక.. ఆదిలాబాద్‌కు కె.పవన్‌కుమార్, యు.శ్రవణ్‌కుమార్, వి.శ్రీలక్ష్మి.. కరీంనగర్‌కు తిరుమలేష్, వికాస్, సంతోష్, మహిత, శ్రీవల్లిక, అనిత ఎంపికయ్యారు.
- హకీంపేట స్కూల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి సి.సావంత్‌కుమార్, వి.అదీక్ష, జి.తేజస్విని. కరీంనగర్‌కు కె.కుషల్, కె.లోకేష్, బి.నవ్యశ్రీ, అంబటి లహరి, ఆదిలాబాద్‌కు ఎన్.లవన్, మూడావత్ అమిత్ సంతోష్ చౌహాన్, మోక్షిత ప్రవేశాలు పొందారు.
- హకీంపేట స్కూల్‌లో వనపర్తి జిల్లా నుంచి ఎం.యశ్వంత్‌కుమార్, కరీంనగర్‌లో విహాన్ గాండ్ల , ఆదిలాబాద్‌లో సాద్విన్ నాయక్ ఎంపికయ్యారు.
- మహబూబ్‌నగర్ జిల్లా నుంచి హకీంపేటలో కె.సునీల్.. జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ఎం.సాత్విక ప్రవేశాలు పొందారు.

అత్యధికంగా నారాయణపేట నుంచి..

గత నెలలో హకీంపేటలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ సెలక్షన్స్ నిర్వహించగా.. ఉమ్మడి జిల్లా విద్యార్థులు అత్యంత ప్రతిభకనబర్చి స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికయ్యారు. రాష్ట్రంలో అత్యధికంగా నారాయణపేట జిల్లా నుంచి 14 మంది ఎంపిక కావడం విశేషం. నాగర్‌కర్నూల్ నుంచి 10 మంది, వనపర్తి నుంచి ముగ్గురు, మహబూబ్‌నగర్, గద్వాల నుంచి ఒక్కొక్కరి చొప్పున విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

సంతోషంగా ఉంది..



హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. రెండు, మూడు రోజుల్లో నాలుగో తరగతిలో చేరుతా. పెద్దయ్యాక ఇంటర్నేషనల్ క్రీడాకారుడినవుతా.
– కె.సునీల్, బూర్గుపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా

మొదటిసారిగా ఎంపికల్లో పాల్గొన్నా..



మొదటిసారిగా జిల్లా, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో పాల్గొన్నా. స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. జిల్లా, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ కోసం మహేష్ సార్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నా.
– జి.సంతోష్, బావన్‌పల్లి, నారాయణపేట జిల్లా

గర్వంగా ఉంది..



నారాయణపేట జిల్లాకు చెందిన 14 మంది విద్యార్థులు స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. రాష్ట్రంలోనే నారాయణపేట నుంచి ఎక్కువ మంది ప్రవేశాలు పొందడం గర్వంగా ఉంది. ఇదే స్ఫూర్తితో రానున్న ఏడాది మరింత మంది చిన్నారులు స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు పొందాలని ఆకాంక్షిస్తున్నా.
– శెట్టి వెంకటేశ్, డీవైఎస్‌ఓ, నారాయణపేట

బీసీల సామాజిక వాటా కోసం ఉద్యమిద్దాం


వీజీఆర్ నారగోనిని సన్మానిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ జనాభా దామాషా ప్రకారం సామాజిక వాటా కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని బీసీ ఐక్యసంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో నిర్వహించిన బీసీల చైతన్య సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా.. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు దక్కడం లేదన్నారు. బీసీల్లో ఐక్యమత్యం లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. బీసీలు ఏకతాటిపై రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాజ్యాధికారంలో సామాజిక వాటా సాధించడమే బీసీ ఐక్యసంఘర్షన సమితి ప్రధాన ఎజెండా అని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతామన్నారు. అనంతరం నారగోనిని స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ.కురుమయ్య, పొన్నకల్ కృష్ణయ్య, ఎర్ర నర్సింహ, సతీష్ కుమార్, మీడియా సెల్ కన్వీనర్ మల్లేష్ యాదవ్, గణేష్, సత్యం, వెంకటరాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వివిధ కారణాలతో నలుగురు బలవన్మరణం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పలు కారణాలతో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో ఆర్థిక సమస్యలు, భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, మనస్తాపం చెంది వారి నిండు జీవితాన్ని బలి తీసుకున్నారు. వీటిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిల్లులు రాక మాజీ ఎంపీటీసీ ఆత్మహత్య


జగన్ (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా/జడ్చర్ల: ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి మాజీ ఎంపీటీసీ, కాంట్రాక్టర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మానసాని జగన్ (46) కొంతకాలంగా కాంట్రాక్టర్‌గా పనిచేసుకుంటూ జీవించేవాడు. మంగళవారం ఇంట్లో నుంచి బీచుపల్లికి వచ్చి కృష్ణానది సమీపంలోని ధ్యాన మందిరం వద్ద ముళ్ల పొదల్లో పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతి చెందాడు. మృతదేహాన్ని గద్వాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. జగన్‌కు వివాహం కాలేదని, సోదరుడు మానసాని రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా జడ్చర్లలో మొదటి నుంచి పంచాయతీ, మున్సిపల్‌కు సంబంధించిన కాంట్రాక్టర్‌గా పలు పనులను చేపట్టేవాడని, ఇటీవల ఈఎండీ, ఎఫ్ఎల్‌డీ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆ కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పేర్కొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త..

పెంట్లవెల్లి: భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గోపులాపూర్ చెందిన జరిపాటి నర్సింహ (37) బుధవారం ఉదయం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తల్లి రోదిస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రామన్‌గౌడ్ చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా తన భార్య లక్ష్మి పుట్టినిల్లు అయిన కల్వరాల్లకు వెళ్లగా, తిరిగి రావడంలేదని మనస్తాపంతో ఉరేసుకున్నట్లు స్థానికులు తెలియజేశారు.

గద్వాలలో ఆర్ఎంపీ..

గద్వాల క్రైం: మండలంలోని జమ్మిచేడ్ చెందిన ఆర్ఎంపీ భాస్కర్ (48) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు. 20ఏళ్లుగా గ్రామంలో ఆర్ఎంపీగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అందుల్లో ఐదేళ్ల క్రితం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నమోదు చేసిన కేసు కోర్టులో పెండింగ్ ఉండడంతో కలత చెందాడు. మరోవైపు కుటుంబ సమస్యలు తీవ్రం కావడంతో తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు హైదరాబాద్‌లో ఉన్న తన భార్య శిరీష, పిల్లలతో మాట్లాడి తన బాధలను వ్యక్తం చేసిన క్రమంలో ధైర్యంగా ఉండాల్సిందిగా భార్య వివరించింది. భర్త చెప్పిన విషయాలపై ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు భార్య తెలియజేయగా హుటాహుటిన సదరు వ్యక్తి గది వద్దకు వెళ్లగా అప్పటికే అపస్మారక స్థితిలో ఉండడంతో బంధువులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం


బొల్లగుట్ట అడవిలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖిల్లాఘనపురం: గొడవ పడి ఐదు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయిన వృద్ధుడి అస్తిపంజరాన్ని బుధవారం గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గాండ్ల చెన్నయ్య(68) ఏప్రిల్ నెలలో ఇంట్లో గొడవ పెట్టుకుని వెళ్లి పోయాడు. గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు కృష్ణంరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం కొందరు వ్యక్తులు మండల కేంద్రంలోని బొల్లగుట్ట అటవీ ప్రాంతం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానం వచ్చి ఫిర్యాదు చేసిన కృష్ణంరాజును అక్కడికి పిలిపించి చూయించారు. ఒంటి పై ఉన్న ఆనవాళ్లు, ఉంగరం, అక్కడ పడి ఉన్న చెప్పులు, దుస్తులు చూసి మృతదేహం చెన్నయ్యగా గుర్తించారు. ఇంట్లో గొడవపడి ఈ ప్రాంతానికి వచ్చి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహ్యత చేసుకుని ఉంటాడని తమకు ప్రాథమికంగా దర్యాప్తులో తెలసిందని ఎస్‌ఐ చెప్పారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 2.52లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం సాయంత్రానికి 2.70లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు 39 క్రస్టు గేట్లను ఎత్తి 2,66,172 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 70, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 717, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,90,246 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,95,580 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 94.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 2.05లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు వద్ద 25 గేట్లను ఎత్తి 2,90,620 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 27.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు 84.967 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. బుధవారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టామన్నారు. ప్రస్తుతం 21,402 క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నారు.

సుంకేసులలో 10 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో 10 గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 47,600 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, 10 గేట్లను తెరిచి 44,790 క్యూసెక్కులు దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు చెప్పారు.

సంగంబండ రిజర్వాయర్ 3 గేట్ల ఎత్తివేత

మక్తల్: మండలంలోని సంగంబండ వద్ద ఉన్న చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ సంగంబండ రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో బుధవారం మూడు గేట్లను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విడుదల చేశారు. కర్ణాటక ఇడ్లూర్ పెద్దవాగు నుంచి నీటి ప్రవాహం అధికమైంది.


సంగంబండ రిజర్వాయర్ వద్ద మూడు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద

మహబూబ్‌నగర్ 370/8

- డేవిడ్ క్రిపాల్ సెంచరీ, రాణించిన కాశీం
- హెచ్‌సీఏ త్రీ డే లీగ్ మ్యాచ్


డేవిడ్ క్రిపాల్ (103 పరుగులు)


కాశీం (72 పరుగులు)


అరుణ్‌కుమార్ (5వికెట్లు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఉమ్మడి పాలమూరు జట్టు – ఖల్సా జట్ల మధ్య హెచ్‌సీఏ త్రీ డేలీగ్ మ్యాచ్ ఉత్కంఠంగా కొనసాగుతుంది. 7 వికెట్లు కోల్పోయి 351 పరుగులతో రెండో రోజు బుధవారం బ్యాటింగ్ చేసిన ఖల్సా జట్టు 89.4 ఓవర్లలో 382 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా బౌలర్ టి.అరుణ్‌కుమార్ 79 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిల్లా జట్టు ఆటముగిసే సమయానికి నిర్ణీత 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 370 పరుగులు చేసింది. జట్టులో డేవిడ్ సెంచరీతో రాణించాడు. 118 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 103 పరుగులు చేశాడు. మిగతా శ్రీకాంత్ 54 పరుగులు, ఈ.కాశీం 72 పరుగులు (నాటౌట్), అబ్దుల్ రాఫే 35, గణేష్, అరుణ్ 32 పరుగులు చేశారు. 12 పరుగులతో ఖల్సా జట్టు లీడ్‌లో కొనసాగుతుంది.

అంగన్‌వాడీ టీచర్‌పై కత్తితో దాడికి యత్నం

జడ్చర్ల: అంగన్‌వాడీ టీచర్‌పై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసేందుకు యత్నించినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు అల్లరి చేస్తుండగా టీచర్ ఎడ్ల విమల పిల్లలను వారిస్తుంది. ఈ క్రమంలో ఓ చిన్నారి తల్లి సావిత్రి అక్కడకు రావడంతో ఆమెతో మాట్లాడుతున్న సమయంలో నరేందర్‌గౌడ్ అకారణంగా అక్కడకు వచ్చి అంగన్‌వాడీ టీచర్‌పై చేయి చేసుకున్నాడు. అనంతరం రాత్రి 8 గంటల సమయంలో ఆయన విమల ఇంట్లోకి చొరబడి రెండు కత్తులతో దాడి చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకుని బయటపడింది. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నాలుగేళ్లు జైలు శిక్ష

జడ్చర్ల: హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ యాసిన్ సయ్యద్ బుధవారం తెలిపారు. మండలంలోని ఈర్లపల్లితండాకు చెందిన కాట్రావత్ రవి, నారాయణలపై వ్యవసాయ పొలం తగాద విషయంలో నవంబర్ 2వ తేదీ, 2018న జర్పుల హరియా నాయక్ కత్తితో దాడి చేశాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ లెనిన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ సబ్ కోర్టు న్యాయమూర్తి ఇందిర కేసు విచారించిన నిందితుడు హరియ నాయక్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఇరువురు ఒక రిపై ఒకరు దాడి చేసుకొని ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పక్కపక్కన ఇళ్లకు దారి విషయంలో మాటా మాట పెరిగి జైపాల్‌రెడ్డి కుర్వ బీచుపల్లిపై దాడికి పాల్పడ్డాడు. ఇదే విషయమై బుధవా రం కుర్వ బీచుపల్లి, లక్ష్మీదేవి, ప్రకాష్, శివ, మధులు కలిసి జైపాల్‌రెడ్డిపై దాడి చేశారు. దీంతో జైపాల్‌రెడ్డి భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం కుర్వ బీచుపల్లి తనపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్న అంత్యక్రియలు పూర్తి.. లభించని తమ్ముడి ఆచూకీ

గోపాల్‌పేట: మండల కేంద్రానికి సినీ డైరెక్టర్ కొమారి జానకీరాం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఆదివారం ఆత్మహత్య చేసుకోగా, బుధవారం అంత్యక్రియలు గ్రామంలో పూర్తయ్యాయి. అంతిమయాత్రకు ఊరంతా బాధతో కదిలింది. ఇదిలా ఉండగా అన్న మృతి తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లిన తమ్ముడు బాలకృష్ణ ఆచూకీ మాత్రం లభించలేదు. సోమవారం సాయంత్రం నుంచి స్నేహితులు, కుటుంబ సభ్యులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా శ్రీశైలం అడవుల్లో సీసీ పుటేజీల ద్వారా గాలిస్తున్నారు. బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో శ్రీశైలం బస్టాండ్‌లో బాలకృష్ణ బైక్ లభించింది. కాగా అందరితో కలివిడిగా ఉండే జానకీరాం ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందనే ప్రశ్న గ్రామస్తులను వేధిస్తోంది. కూకట్‌పల్లి పోలీసులు సూసైడ్‌నోట్ లభించడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తుల పేర్లు రాశాడని వాటి ఆధారంగా కేసు నమోదు చేసినట్లు తెలిసింది. సినిమా కోసం చేసిన అప్పుల వల్ల కాదని, తనను తన పక్కనే ఉండి ఓ కుటుంబం పథకం ప్రకారం మోసం చేయడంతో పాటు మానసికంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని వాట్సాప్ గ్రూపుల్లో జానకీరాం చెప్పిన వాయిస్ రికార్డు చక్కర్లు కొడుతుంది.